
www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 22 జూన్ 2024
5
ఏలూరు



భూతగాదాల పరిష్కారంలో సర్వేయర్లు కీలకం

ఉంగుటూరు : భూమి, పొలాల సరిహద్దు తగాదాల పరిష్కారానికి గ్రామ సర్వేయర్లు కీలకంగా వ్యవహరించాలని ఏలూరు డివిజన్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ టిబిఎస్‌పి.రమణ అన్నారు. భీమడోలు మండల కార్యాలయంలో నిడమర్రు, ఉంగుటూరు, భీమడోలు మండలాల గ్రామ సర్వేయర్లకు అవగాహనా సమావేశం నిర్వహించారు. కొత్త ప్రభుత్వం వచ్చిన నేపథ్యంలో రీసర్వే నిర్ణయం మేరకు సర్వేయర్లు విధులు నిర్వహించాలని, పబ్లిక్ గ్రీవెన్స్ సకాలంలో పరిష్కరించాలని సూచించారు. సర్వేయర్లు రైతులతో కటువుగా కాకుండా మృదువుగా సామరస్యంగా మాట్లాడి అక్కడున్న సమస్యను వివరించారు. దాని పరిష్కారానికి తగు చర్యలు చేపట్టాలని తగాదాలకు వెళ్లొద్దని సూచించారు. సరిహద్దులపై పబ్లిక్ గ్రీవెన్స్ పరిష్కారంలో సత్వర చర్యలు చేపట్టాలన్నారు. ప్రజలతో మాట్లాడే విధానం మారాలని విజ్ఞప్తి చేశారు. ఉంగుటూరు, భీమడోలు, నిడమర్రు మండల సర్వేయర్లు పి.శ్రీనివాస్, ధర్మారావు, విజయరాజు పాల్గొన్నారు.

ప్రతీకారమా.. అభివృద్ధా..!



డిఇఒకు వినతిపత్రం అందిస్తున్న నేతలు (ఫైల్‌ఫోటో)

ఎంఎల్‌ఎల ప్రమాణ స్వీకారం పూర్తి

ప్రజా సమస్యలపై దృష్టి సారించాలని అంతా వేడుకోలు

పలు నియోజకవర్గాల్లో కక్షసాధింపు రాజకీయాలకు ఆజ్యం

మధ్యాహ్న భోజన కార్మికులు తప్పకోవాలనే ఒత్తిళ్లపై చర్చ

గత ప్రభుత్వంలోనూ ఇదే పరిస్థితి

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఎంఎల్‌ఎలుగా గెలిచి ప్రమాణ స్వీకారం చేసిన నాయకులు తమ నియోజకవర్గాల్లో అభివృద్ధిపై దృష్టి సారించాలని, గత ప్రభుత్వం కొనసాగించిన కక్ష సాధింపు రాజకీయాలకు స్వస్తి పలకాలని అంతా కోరుకుంటున్నారు. ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాత పలు నియోజకవర్గాల్లో చోటుచేసుకుంటున్న ఘటనలు గత ప్రభుత్వంలో జరిగిన దౌర్జన్యకాండను గుర్తు చేస్తున్నట్లు సర్వత్రా చర్చ సాగుతోంది. ఇదేవిధంగా ముందుకు సాగితే నూతన ప్రభుత్వం కొద్దికాలంలోనే ప్రజాగ్రహానికి గురికాక తప్పదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. రెండు జిల్లాల్లో గెలిచిన 14 మంది ఎంఎల్‌ఎల్లో ఆచంట ఎంఎల్‌ఎ పితాని సత్యనారాయణ మినహా మిగిలిన 13 మంది శుక్రవారం అసెంబ్లీలో ప్రమాణ స్వీకారం చేశారు. ఇక నుంచి అధికారికంగా ప్రజాప్రతినిధి హోదాలో బాధ్యతలు నిర్వహించనున్నారు. జిల్లాలోని అన్ని నియోకజవర్గాల్లోనూ అనేక సమస్యలతో జనం సతమతవుతున్నారు. తాగడానికి నీరులేదు. ఎంతోమంది పేదలకు ఉండేందుకు ఇల్లు లేదు. పిల్లల చదువు కోసం నానా కష్టాలు పడుతున్నారు. రోడ్లు లేవు. ఉపాధి లేమి వెంటాడుతోంది. పండించిన పంటకు మద్దతు ధర దక్కడం లేదు. విద్యుత్ బిల్లుల పేరుతో ప్రభుత్వ పథకాలు నిలిచిపోయాయి. ఇలా అనేక సమస్యలతో జనం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఒక్కో నియోజకవర్గంలో ఒక్కో రకంగా సమస్యలు విలయతాండవం చేస్తున్నాయి. ప్రజాప్రతినిధులు ప్రజాసమస్యల పరిష్కారంపై దృష్టి సారిస్తే జనాలకు ప్రయోజనం చేకూరుతుంది. అయితే ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాత దెందులూరు, ఏలూరు వంటి నియోజకవర్గాల్లో కక్ష సాధింపు రాజకీయాలు ప్రారంభమయ్యాయనే చర్చ నడుస్తోంది. ఏలూరు నియోజకవర్గంలో ఇప్పటికే ప్రత్యర్థులకు సంబంధించిన హోటళ్లు, దుకాణాలు మూయించి ఆర్థిక మూలాలపై దెబ్బకొట్టడం వంటి ఘటనలపై జనంలో చర్చ సాగుతోంది. వైసిపి కౌన్సిలర్లను అధికార పార్టీలోకి రావాలని ఒత్తిళ్లు కొనసాగుతున్నట్లు ప్రచారం సాగుతోంది. దెందులూరు నియోజకవర్గంలోనూ ఇదే పరిస్థితి ఉందని చెబుతున్నారు. మధ్యాహ్న భోజన కార్మికులను వారు చేస్తున్న పనుల నుంచి తప్పుకోవాలని, లేకపోతే తామే తప్పిస్తామని హుకుం జారీ చేసినట్లు కార్మికులు చెబుతున్నారు. తమపై వస్తున్న బెదిరింపులపై జిల్లా విద్యాశాఖ అధికారికి మధ్యాహ్న భోజన కార్మికులు వినితిపత్రం ఇవ్వడం చూస్తే పరిస్థితి ఏవిధంగా ఉందో స్పష్టమవుతోంది. మిగిలిన నియోజకవర్గాల్లోనూ కక్షసాధింపు రాజకీయాలు సాగుతున్నట్లు జనాల్లో చర్చ సాగుతోంది. దీంతో ప్రభుత్వం ఏర్పడి పట్టుమని వారం రోజులు కాకముందే గత ప్రభుత్వానికి, వీరికి తేడా ఏమిటనే చర్చ నడుస్తోంది. గత ప్రభుత్వ హయాంలో ఎంఎల్‌ఎలు పూర్తిగా నియోజకవర్గ అభివృద్ధిని గాలికి వదిలేశారు. సంక్షేమ పథకాలపై ప్రచారం తప్ప జనాలకు అవసరమైన రోడ్లు, తాగునీరు వంటి కనీస సదుపాయాలను సైతం పరిష్కరించని పరిస్థితి ఉంది. పోలవరం నిర్వాసితుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంలోనూ విఫలమయ్యారు. చింతలపూడి ఎత్తిపోతల బాధిత రైతులకు న్యాయమైన పరిహారం ఇప్పించేందుకు ఎటువంటి ప్రయత్నమూ చేయలేదు. కొల్లేరులో రెగ్యులేటర్ల నిర్మాణాన్ని పట్టించుకోలేదు. ధాన్యం కొనుగోలులో సంచులు, లారీల సమస్యలను సైతం పరిష్కరించకుండా అధికారులు చెప్పిందే వేదం అన్నట్లు వ్యవహరించారు. అంతేకాకుండా మట్టి, ఇసుక అక్రమ తవ్వకాలు, భూముల కబ్జాలు భారీగా సాగిన పరిస్థితి ఉంది. ఎవరైనా సమస్యలపై ప్రశ్నిస్తే ప్రభుత్వ పథకాలు ఆపేస్తామని బెదిరించడం నిత్యకృత్యంగా ఉండేది. ఈ ప్రభుత్వంలోనైనా కక్ష సాధింపు రాజకీయాలకు స్వస్తి పలికి, అభివృద్ధిపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు. ప్రభుత్వ అధినేతలు సైతం ఎంఎల్‌ఎలకు ఆవిధంగా దిశానిర్దేశం చేయాలని కోరుతున్నారు. మరి జిల్లాలో ఎంఎల్‌ఎలు ఏవిధంగా ముందుకు సాగుతారో వేచిచూడాలి.

సముద్ర స్నానానికి వెళ్లి ముగ్గురు మృతి

మరొకరు గల్లంతు


చీరాలలో ఘటన

దుగ్గిరాలలో విషాదఛాయలు

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

నగరంలోని దుగ్గిరాల, అంకన్నగూడెం, పెదకడిమికి చెందిన 11 మంది యువకులు ఆనందంగా గడిపేందుకు చీరాల సముద్రతీరానికి వెళ్లారు. వారందరూ సముద్ర స్నానం చేస్తుండగా నలుగురు యువకులు గల్లంతయ్యారు. వారిలో ముగ్గురి మృతదేహాలు లభ్యమయ్యాయి. నాలుగో యువకుని కోసం గాలింపు చర్యలు చేపట్టారు. మృతి చెందిన ముగ్గురు, గల్లంతైన ఒకరు మొత్తం దుగ్గిరాలకు చెందిన వారు కావడంతో ఆ గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... ఏలూరు నగరంలోని మూడో పట్టణ పరిధిలో దుగ్గిరాల ప్రాంతానికి చెందిన ఎనిమిది మంది, అంకన్నగూడేనికి చెందిన ఇద్దరు, పెదకడిమి గ్రామానికి చెందిన ఒకరు మొత్తం 11 మంది యువకులు కలిసి సరదాగా గడిపేందుకు చీరాల సముద్ర తీరానికి టాటా ఎస్ వాహనంలో దుగ్గిరాల గ్రామం నుంచి శుక్రవారం ఉదయం పది గంటల సమయంలో బయలుదేరి వెళ్లారు. వీరిలో కొందరు కూలి పనులు చేస్తూ జీవనాన్ని సాగిస్తూ ఉండగా మరికొందరు చదువుకుంటున్నారు. ఈ క్రమంలో వారంతా చీరాల సముద్రతీరంలో యాత్రికులందరూ స్నానం చేసే ప్రాంతంలో కాకుండా వేరే ఒక ప్రాంతంలో సముద్రంలోకి దిగారు. ఈ సమయంలో హఠాత్తుగా పెద్ద కెరటం రావడంతో ఒక్కసారిగా నలుగురు యువకులు నీట మునిగారు. అప్రమత్తమైన తోటి స్నేహితులు వీరిని కాపాడేందుకు ప్రయత్నించినా ఉపయోగం లేకుండాపోయింది. నలుగురు యువకులు గల్లంతయ్యారు. వారి కోసం స్థానికులు గాలింపు చర్యలు చేపట్టగా ముగ్గురి మృతదేహాలు లభ్యమయ్యాయి. నాలుగో యువకుడి కోసం రెస్క్యూటీమ్ పూర్తిస్థాయిలో కృషి చేస్తుంది.

మృతి చెందిన ముగ్గురు, గల్లంతైన యవకుడు మొత్తం నలుగురు దుగ్గిరాల గ్రామానికి చెందినవారు. వారిలో మృతి చెందిన ముగ్గురు జాల కిషోర్ (24) స్థానికంగా వంట మేస్త్రిగా పనిచేస్తూ లైటింగ్ సౌండ్ సిస్టంలను అద్దెకు ఇస్తుంటారు. గోటికల తేజ (నాని) (19) ఇంటర్ పూర్తి చేసి ప్రస్తుతం కూలి పనులు చేస్తున్నాడు. చెట్టుమాల నితిన్ (19) ఇంటర్ చదువుతున్నాడు. గల్లంతైనా మరో యువకుడు కోరు అమల్‌రాజ్ ఇంటర్ వరకు చదివి ప్రస్తుతం కూలి పనులు చేస్తున్నాడు. ఒకే గ్రామానికి చెందిన ముగ్గురు మృతి చెందగా, మరొకరు గల్లంత కావడంతో దుగ్గిరాల గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. దెందులూరు ఎంఎల్‌ఎ చింతమనేని ప్రభాకర్ స్పందించి చీరాల పోలీసులతో ఆయన ఫోన్‌లో మాట్లాడారు. నాలుగో యువకుని కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేయాలని సూచించారు.



బీచ్‌లో మృతదేహాలు

అతిసార నియంత్రణపై 1 నుంచి అవగాహన

కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ప్రజాశక్తి - ఏలూరు

డయేరియా నియంత్రణపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు జులై ఒకటో తేదీ నుండి ఆగస్టు 31వ తేదీ వరకు జిల్లావ్యాప్తంగా విస్తృతంగా ప్రచార కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ తెలిపారు. రాష్ట్ర సచివాలయం నుంచి శుక్రవారం అతిసార కేసుల వ్యాప్తి (స్టాప్ డయేరియా క్యాంపెయిన్) నియంత్రణ ప్రధాన అంశంగా జిల్లా కలెక్టర్లతో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో జులై ఒకటో తేదీ నుంచి ఆగస్టు 31 వరకు స్టాప్ డయేరియా క్యాంపెయిన్ విస్తృతంగా చేపట్టేందుకు జిల్లాస్థాయి టాస్క్‌ఫోర్స్ కమిటీని ఏర్పాటు చేశారన్నారు. జిల్లాలో ఎక్కడా అతిసార కేసులు వ్యాప్తి చెందకుండా ముందస్తుగానే పకడ్బందీ చర్యలు తీసుకోవాలన్నారు. దీనికి వైద్య ఆరోగ్యశాఖ, ఆర్‌డబ్ల్యుఎస్, పంచాయతీరాజ్ తదితర శాఖలు సమగ్ర కార్యాచరణ రూపొందించుకోవాలన్నారు. గతంలో అతిసార కేసులు నమోదైన ప్రాంతాలపై ప్రధాన దృష్టి సారించాలన్నారు. నీటి నమూనా పరీక్షలను ముమ్మరం చేయాలన్నారు. ప్రజలను అప్రమత్తంగా ఉంచేందుకు అవగాహనా కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలన్నారు. కాచిన నీరు తాగాలన్నారు. సమావేశంలో డిఎంహెచ్‌ఒ డాక్టర్ ఎస్.శర్మిష్ట, డిసిహెచ్‌ఎస్ పాల్ సతీష్‌కుమార్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్‌ఇ సత్యనారాయణ, నగరపాలక సంస్థ కమిషనర్ ఎస్.వెంకటకృష్ణ, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ నాగేశ్వరరావు, డిఎల్‌పిఒ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

24న 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ' ప్రారంభం

కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ప్రజాశక్తి - ఏలూరు

ఈ నెల 24వ తేదీ సోమవారం ఉదయం 10 గంటల నుండి ఏలూరు కలెక్టరేట్లోని గోదావరి సమావేశపు హాలులో ప్రజల నుండి ఫిర్యాదులు స్వీకరించేందుకు 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ'ను ప్రారంభించనున్నట్లు కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమం జిల్లా కలెక్టరేట్‌తోపాటు జిల్లాలోని అన్ని డివిజినల్, మండల, మున్సిపల్ కార్యాలయాల్లో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. దీన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మేలు రకం వరి విత్తనాలనే ఎంచుకోవాలి

జిల్లా వ్యవసాయాధికారి ఉషాకుమారి

ప్రజాశక్తి - ముసునూరు

రైతులు నారుమడులు సిద్ధం చేసుకునే ముందు విత్తన శుద్ధి, మేలు రకం వరి వంగడం విత్తనాలను ఎంచుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి ఉషాకుమారి చెప్పారు. ఖరీఫ్ సీజన్ మొదలు కావడంతో నారుమడులు సిద్ధం చేసుకునే సమయంలో కొన్ని అధునాతన మెళకువలతో నారుమడులు పోసినట్లయితే దిగుబడి పెరిగి అధిక ఆదాయం పొందవచ్చన్నారు. మండలంలోని చెక్కపల్లి గ్రామంలో నారుమడులు పోసిన పొలాలను ఆమె శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కొందరి నారుమడుల్లో కాండం తొలుచు పురుగు కనిపించడంతో నివారణ చర్యలు వివరించారు. అనంతరం రైతులకు పంట దిగుబడి ఎలా పెంచుకోవాలో అవగాహన కల్పించారు.

యోగాతో మానసిక ప్రశాంతత : ఎఎస్‌పి

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

మానసిక ప్రశాంతతకు, ఉల్లాసానికి యోగా ఎంతగానో దోహదపడుతుందని జిల్లా అదనపు ఎస్‌పి స్వరూపరాణి తెలిపారు. నగరంలోని జిల్లా పోలీస్ మైదానంలో శుక్రవారం యోగా దినోత్సవం సందర్భంగా జిల్లా అదనపు ఎస్‌పి స్వరూపరాణి ఆధ్వర్యంలో పోలీసు సిబ్బందికి యోగా శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వారు యోగాసనాలను సిబ్బందికి నేర్పించారు అనంతరం అదనపు ఎస్‌పి స్వరూపరాణి మాట్లాడుతూ యోగా ఎంతో ప్రాచుర్యమైన కలగా ఆమె తెలిపారు. ఈ కార్యక్రమానికి యోగా సెంటర్ నిర్వహించే వెంకటేశ్వరరావు, గౌరీ శంకర్, సత్యనారాయణలు ఆహ్వానితులుగా వచ్చి పలు యోగాసనాలను సిబ్బందికి నేర్పించారన్నారు. ఈ కార్యక్రమంలో ఎఆర్ ఎస్‌పి ఎన్‌ఎస్‌ఎస్.శేఖర్, ఎఆర్ ఆర్‌ఐ పవన్‌కుమార్, ఎఆర్ డిఎస్‌పి శ్రీహరి పాల్గొన్నారు.

స్వచ్ఛమైన తాగునీరు సరఫరా చేయాలి

ముదినేపల్లి-బంటుమిల్లి రోడ్డులో

వడాలి గ్రామస్తుల రాస్తారోకో

పెద్ద ఎత్తున నిలిచిపోయిన వాహనాలు

అధికారుల హామీతో విరమణ



వడాలి సెంటర్‌లో రాస్తారోకో చేస్తున్న మహిళలు

ప్రజాశక్తి - ముదినేపల్లి

పంచాయతీ కుళాయిల ద్వారా స్వచ్ఛమైన తాగునీరు సరఫరా చేయాలంటూ మండలంలోని వడాలి గ్రామస్తులు శుక్రవారం రాస్తారోకో చేశారు. ముదినేపల్లి - బంటుమిల్లి రోడ్డులో వడాలి సెంటర్‌లో పెద్ద సంఖ్యలో మహిళలు చేరి పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ పంచాయతీ కుళాయిల ద్వారా వచ్చే నీరు పసర్ల కట్టి దుర్వాసన వస్తుందన్నారు. ఈ నీరు తాగేందుకు ఏమాత్రం ఉపయోగంగా లేదన్నారు. కనీసం స్నానం చేసేందుకు కూడా ఈ నీరు పనికిరాదని, ఈ నీటిని వినియోగించిన వారికి దురదలు, చర్మ వ్యాధులు వస్తున్నాయని చెప్పారు. మంచినీటి చెరువు అంతా గుర్రపు డెక్కతో నిండిపోవడంతో డెక్క కుళ్లిపోయి నీరు దుర్గంధం వెదజల్లుతుందన్నారు. పలుసార్లు గ్రామపంచాయతీ పాలకవర్గానికి, పంచాయతీ కార్యదర్శికి మొరపెట్టుకున్నప్పటికీ ఏ మాత్రం స్పందించడం లేదంటూ ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు వెంటనే స్పందించి పంచాయతీ కుళాయిల ద్వారా స్వచ్ఛమైన తాగునీటిని సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ఈ రాస్తారోకో ప్రధాన రహదారిలో చేయడంతో పెద్ద ఎత్తున వాహనాలు నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న ఎంపిడిఒ మురళీగంగాధరరావు, ఇఒపిఆర్‌డి దూలం లక్ష్మీనారాయణ, పంచాయతీ కార్యదర్శి జి.రమేష్ వచ్చి సమస్యను పరిష్కరించేందుకు వెంటనే చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ పంచాయతీ నీరు కలుషితం కారణంగా ఏమాత్రం వినియోగించేందుకు వీలు లేకుండా పోయిందన్నారు. వెంటనే బోరు ఏర్పాటు చేసి నీటిని కుళాయిల ద్వారా గ్రామస్తులకు సరఫరా చేయాలని కోరారు. దీనిపై అధికారులు స్పందిస్తూ శనివారం సంబంధిత అధికారులు వచ్చి నీటిని పరిశీలించిన తరువాత తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు. స్వచ్ఛమైన తాగునీరు గ్రామస్తులకు అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అధికారులు ఇచ్చిన హామీ మేరకు మహిళలు రాస్తారోకో విరమించారు.

మెగా లోక్ అదాలత్‌పై అవగాహన కల్పించండి

చింతలపూడి జూనియర్ సివిల్ జడ్జి సి.మధుబాబు

ప్రజాశక్తి - చింతలపూడి

ఈ నెల 29వ తేదీన నిర్వహించే మెగా లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకునేలా న్యాయవాదులు, పోలీసులు అవగాహన కల్పించాలని చింతలపూడి జూనియర్ సివిల్ జడ్జి సి.మధుబాబు తెలిపారు. చింతలపూడి కోర్టు ఆవరణలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 29వ తేదీన చింతలపూడి కోర్టులో మెగా లోక్ అదాలత్ నిర్వహించి అందులో రాజీ పడే క్రిమినల్ కేసులు, చెక్ బౌన్స్ కేసులు, కుటుంబ తగాదాల కేసులు, భార్యా భర్తల మధ్య ఉన్న మనోవర్తి కేసులు, డొమెస్టిక్ వయోలెన్స్ కేసులు, సివిల్ కేసులు, భూమి తగాదా కేసులు, ప్రామిసరీ నోట్ కేసులు, బ్యాంక్ కేసులు పరిష్కరిస్తారని చెప్పారు. అలాగే ప్రీ లిటిగేషన్ కేసులుగా బ్యాంక్ బకాయి కేసులు, టెలిఫోన్ బకాయి కేసులు పరిష్కరిస్తారని తెలిపారు. ప్రతి రోజూ కోర్టులో ప్రీ సిట్టింగ్స్ ద్వారా కేసులు రాజీ చేస్తున్నారని కక్షిదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. కేసులు రాజీ చేసుకోవడం వల్ల విలువైన సమయం, డబ్బు ఆదా అవుతాయన్నారు. ఈ సమావేశంలో న్యాయవాదులు,బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నాగేశ్వరరావు, న్యాయవాదులు పాల్గొన్నారు.

నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలి

ప్రజానాట్యమండలి ఏలూరు జిల్లా సబ్ కమిటీ కన్వీనర్ టివిఎస్.రాజు

ప్రజాశక్తి - కామవరపుకోట

రాష్ట్రంలో ఐదేళ్ల తర్వాత తిరిగి అధికార పగ్గాలు చేపట్టిన తెలుగుదేశం ప్రభుత్వంపై ప్రజలు చూపిన అభిమానం, ఆశీస్సులు కొనసాగాలంటే భారీగా పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలని ప్రజానాట్యమండలి ఏలూరు జిల్లా సబ్ కమిటీ కన్వీనర్ టివిఎస్.రాజు డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ముందస్తు చర్యలు తీసుకొని పెరిగిపోతున్న నిత్యావసర వస్తువులు ధరలు తగ్గించకపోతే అధికార పగ్గాలు అందించిన ప్రజలే ఆందోళనలు నిర్వహించి ప్రభుత్వాన్ని అధికారం నుంచి గద్దె దించుతారన్నారు. ప్రజల బాధలు అర్థం చేసుకుని ప్రభుత్వం నిత్యావసర వస్తువుల ధరలు అదుపు చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తత అవసరం

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, తమ పరిధిలోని గ్రామాల్లో వైద్య సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారని కొయ్యలగూడెం ప్రైమరీ హెల్త్ సెంటర్ సిహెచ్‌ఒ నాగమణి తెలిపారు. వైద్య సిబ్బంది ప్రజలకు పరిసరాల పరిశుభ్రతపై, వ్యాధుల ప్రబలకుండా నియంత్రణను చేసుకోవాలని సూచనలు చేస్తున్నామన్నారు. పంచాయతీ సిబ్బంది వారికి వాటర్ హెడ్ ట్యాంకులను ప్రతి 15 రోజులకోసారి శుభ్రం చేయాలని చెప్పారు. వర్షాకాలంలో ఎక్కువగా దోమలు పెరిగే అవకాశం ఉన్నందున నీరు నిల్వ లేకుండా మురికి కాలువలు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. దోమల వల్ల వచ్చే డెంగీ, చికెన్‌గున్యా, మలేరియా గురించి తమ వైద్య సిబ్బంది డోర్ టు డోర్ సర్వే చేస్తూ అవగాహన కల్పిస్తారన్నారు.

పెట్టుబడి సాయం వెంటనే ఇవ్వాలి

ఎపి రైతుసంఘం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఖరీఫ్ సాగుకు పెట్టుబడుల కోసం అన్నదాతలు ఇబ్బందులు పడుతున్నారని, ఎన్నికల హామీ ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం రైతులకు, కౌలురైతులకు పంట పెట్టుబడి సాయం రూ.20 వేలు వెంటనే అందించాలని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ కోరారు. గత ప్రభుత్వ హయాంలో ట్రాక్టర్ల పంపిణీలో జరిగిన అవకతవకలపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక అన్నే భవనంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వ వ్యవసాయ పథకాలు వాస్తవ సాగుదారులకు అందడం లేదన్నారు. ఫలితంగా పేద, కౌలు రైతులు పంట సాగుకు అధిక పెట్టుబడి పెట్టాల్సి వస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ హయాంలో టార్పాలిన్లు సైతం ఇవ్వకపోవడం వల్ల తుఫాన్లు, అధిక వర్షాల సందర్భంగా పంటను రక్షించుకోలేక ఇబ్బందులు పడ్డారని గుర్తు చేశారు. మెట్ట ప్రాంతంలో డ్రిప్ ఇరిగేషన్‌తోనే వ్యవసాయం సాగుతోందని, అట్లాంటి పథకాన్ని అటకెక్కించారని విమర్శించారు. పంట పెట్టుబడి సాయం నిధులను రాష్ట్ర ప్రభుత్వం తక్షణం విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఎంఎల్‌ఎల ప్రమాణస్వీకారం



కొలుసు పార్థసారధి, నూజివీడు ఎంఎల్‌ఎ



నిమ్మల రామానాయుడు, పాలకొల్లు ఎంఎల్‌ఎ



చింతమనేని ప్రభాకర్, దెందులూరు ఎంఎల్‌ఎ



ఆరిమిల్లి రాధాకృష్ణ, తణుకు ఎంఎల్‌ఎ



పులపర్తి అంజిబాబు భీమవరం ఎంఎల్‌ఎ




కనుమూరి రఘురామకృష్ణంరాజు, ఉండి ఎంఎల్‌ఎ




బడేటి రాధాకృష్ణయ్య (చంటి), ఏలూరు ఎంఎల్‌ఎ



సొంగా రోషన్‌కుమార్, చింతలపూడి ఎంఎల్‌ఎ



బొలిశెట్టి శ్రీనివాస్, తాడేపల్లిగూడెం ఎంఎల్‌ఎ



పత్సమట్ల ధర్మరాజు, ఉంగుటూరు ఎంఎల్‌ఎ



బొమ్మిడి నాయకర్, నరసాపురం ఎంఎల్‌ఎ



చిర్రి బాలరాజు, పోలవరం ఎంఎల్‌ఎ



కామినేని శ్రీనివాస్, కైకలూరు ఎంఎల్‌ఎ

పంచాయతీ కార్యాలయంలో ఎంపిడిఒ తనిఖీలు

ప్రజాశక్తి - పోలవరం

మండలంలోని ప్రగడపల్లి పంచాయతీ కార్యాలయాన్ని ఎంపిడిఒ జి.శ్రీను శుక్రవారం ఉదయం పరిశీలించారు. సిబ్బంది హాజరు, పనితీరు, రికార్డుల నిర్వహణ, సచివాలయ సిబ్బంది హాజరు పనితీరు పరిశీలించారు. అనంతరం యోగా డే కార్యక్రమంలో పాల్గొన్నారు.

విద్యార్థులకు పలకలు అందజేత

ప్రజాశక్తి - ఏలూరు

స్థానిక గరుడ పక్షి నగర్ ఎంపిపి పాఠశాల విద్యార్థులకు దాంగేనగర్ అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో పలకలు పంపిణీ చేశారు. పాఠశాలలో కొత్తగా చేరిన విద్యార్థులకు అవసరమైన పలకలు, పెన్సిళ్లను ప్రధానోపాధ్యాయులు నాగలక్ష్మి ద్వారా విద్యార్థులకు అందించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ యువజన సంఘం వ్యవస్థాపకులు అమ్ముల రంగా మాట్లాడారు. సంఘ గౌరవ అధ్యక్షులు నేలపోలు ప్రభాకరరావు విజ్ఞప్తి మేరకు సంఘ సభ్యులు ఆబంటి శ్రీనివాస్ ఆర్థిక సహకారంతో నూతనంగా బడిలో చేరిన చిన్నారులకు పలకలను పంపిణీ చేసినట్లు తెలిపారు. గరుడపక్షి నగర్ ఎంపిపి పాఠశాల విద్యార్థులకు అవసరమైన స్టీల్ ప్లేట్లు, గ్లాసులు త్వరలో అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో దాంగే నగర్ అంబేద్కర్ యువజన సంఘం గౌరవ అధ్యక్షులు నేలపోలు ప్రభాకరరావు, అధ్యక్ష కార్యదర్శులు కె.లక్ష్మణరావు, పటాన్ బాజీ, ప్రధానోపాధ్యాయురాలు నాగలక్ష్మి, ఉపాధ్యాయులు నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

సిపిఎం శిక్షణా తరగతులు విజయవంతం

ప్రజాశక్తి - పోలవరం

సిపిఎం కార్యకర్తల శిక్షణ తరగతులు విజయవంతమయ్యాయని సిపిఎం పోలవరం మండల కార్యదర్శి గుడెల్లి వెంకట్రావు చెప్పారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సిపిఎం ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.రవి మాట్లాడుతూ రెండు రోజుల పాటు ఇంజరం గ్రామంలో శిక్షణ తరగతులు జరిగినట్లు చెప్పారు. పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల సమస్యలు పరిష్కార దిశగా కొత్త ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, పునరావాస గ్రామాలకు తరలించాలని పరిహారాలు వెంటనే చెల్లించాలని కోరారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు తెల్లం రామకృష్ణ మాట్లాడుతూ ఏజెన్సీలో 1/70 చట్టం నిర్వీర్యం గిరిజన సాగులో ఉన్న భూములకు పట్టాలు తక్షణమే ఇవ్వాలని, అడవులోకి ఎక్కించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సభ్యులు మిడియం నాగమణి, పోలవరం మండల కమిటీ సభ్యులు తామ బాలరాజు, సమ్మిడాల సాయికృష్ణ, మడివి చలపతి, బొరగం భూచంద్రరావు పాల్గొన్నారు.

'చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి'

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం టౌన్

చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రం అద్భుతమైన ప్రగతిని సాధిస్తుందని టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ దాసరి శ్యామ్ చంద్రశేషు అన్నారు. జంగారెడ్డిగూడెంలోని టిడిపి కార్యాలయంలో ఆయన శుక్రవారం మాట్లాడారు. 2021లో అప్పటి అధికారపక్షం చంద్రబాబు కుటుంబాన్ని వ్యక్తిగతంగా దూషించారని, ఈ నేపథ్యంలో ఇది ప్రజల కోసం పనిచేసే గౌరవ సభ కాదని, సభ్యులు కించపరిచే కౌరవ సభగా ఉందని అలాంటి సభలో తాను ఉండనని, మళ్లీ ముఖ్యమంత్రి అయ్యాక ఈ సభకు అడుగుపెడతానని, ఈ సభను గౌరవ సభగా మారుస్తానని చెప్పిన చంద్రబాబు ఎన్నెన్నో సవాళ్లను సమస్యలను అధిగమించి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఈ అసెంబ్లీలో అడుగు పెట్టారన్నారు. చింతలపూడి ఎంఎల్ఎగా ప్రమాణ స్వీకారం చేసిన సొంగా రోషన్‌కుమార్‌కు అభినందనలు తెలిపారు.

గిరిజన నాయకుడిపై దాడి అమానుషం

వైసిపి రాష్ట్ర ఎస్‌టి సెల్ అధ్యక్షుడు నిరీక్షణరావు

ప్రజాశక్తి - టి.నరసాపురం

వైసిపి గిరిజన నాయకుడిపై దుండగులు దాడి చేయడం అమానుషమని వైసిపి రాష్ట్ర ఎస్‌టి సెల్ అధ్యక్షుడు కురసం నిరీక్షణరావు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలోని కృష్ణాపురం గ్రామానికి చెందిన వైసిపి కార్యకర్త భుక్యా వేణు తన వ్యక్తిగత పనులతో టి.నరసాపురం వెళ్తుండగా టి.నరసాపురం చింతల వద్ద కొందరు దుండగులు దాడి చేశారన్నారు. దాడిలో గాయపడిన వేణును బంధువులు చింతలపూడి ఆసుపత్రికి తరలించారని తెలిపారు. దాడి చేసిన వారిని గుర్తించి వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. వైసిపి కార్యకర్తలపై ఇటువంటి దాడులకు పాల్పడడం హేయమైన చర్య అన్నారు. ఇటు వంటి దాడులకు భయపడేది లేదని హెచ్చరించారు. దాడి చేసిన వారిపై ఎస్‌సి ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదు చేసి బాధితునికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

పల్లా శ్రీనివాస్‌ను కలిసిన టిడిపి నాయకులు

ద్వారకాతిరుమల : టిడిపి గాజువాక నియోజకవర్గ ఎంఎల్‌ఎ ఎన్నికై ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా నియమితులైన పల్లా శ్రీనివాసరావు యాదవ్‌ను ద్వారకా తిరుమల నాయకులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పల్లా శ్రీనివాసరావును శాలువాతో సత్కరించి వెంకటేశ్వరస్వామి ప్రసాదాలు అందించారు. ఆయనను కలిసిన వారిలో టిడిపి నాయకులు కురుకూరు బుజ్జి, ఇమ్మడి రత్నాజీ, సువ్వల మావుల్లు, కోలుకులూరి రవి ఉన్నారు.

గేదెల అక్రమ రవాణా

ప్రజాశక్తి - కుక్కునూరు

మండలంలోని గోదావరి ఒడ్డున ఆనుకుని ఉన్న గ్రామాల నుంచి పశువుల అక్రమ రవాణా చాటుమాటుగా చప్పుడు కాకుండా జరుగుతుంది. తాజాగా ఇబ్రహీంపేట గోదావరి ఒడ్డు నుండి 36 గేదెలను వడ వాహనాల్లో ఎక్కించి రవాణా చేస్తుండగా 19వ తేదిన పోలీసులు పట్టుకున్నారు. పట్టుకున్నప్పుడు ఎటువంటి పత్రాలు లేకపోవడంతో స్టేషన్‌కు తరలించారు. 19 నుండి 20వ తేదీ వరకు లేని పత్రాలు రెండో రోజుకు ఎలా వచ్చాయని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. గేదెల రవాణా జరుగుతున్నప్పుడు పట్టుబడితే సరైన పత్రాలు చూపకపోతే కేసులు అవడం చూస్తుంటాము, కాని ఇక్కడ మాత్రం పట్టుకున్న సమయంలో సరైన పత్రాలు ఉండవని, రెండో రోజుకు ఎలా వస్తాయని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. పోలీసులు వాహనాల తనిఖీల్లో భాగంగా సరైన పత్రాలు లేనప్పుడు, పత్రాలు తెచ్చుకునే వరకు వస్తామంటే ఫైన్ వేయకుండా వదిలేస్తారా అని మండల ప్రజలు అంటున్నారు.

నేరాలు - ఘోరాలు

ట్రాక్టర్ అదుపుతప్పి వలస కూలీ మృతి

ప్రజాశక్తి - టి.నరసాపురం

ట్రాక్టర్ అదుపు తప్పడంతో బీహార్ నుంచి వలస వచ్చిన కూలీ మృతి చెందాడు. టి.నరసాపురం ఎస్ఐ డి.దుర్గామహేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం... బీహార్ రాష్ట్రం జమ్ము జిల్లా బహరాంపనిసిండ్ర మండలం ముజఫర్పూర్ గ్రామానికి చెందిన సరేన్ మంజి(29) మరికొందరు కూలీలు కలిసి ఖమ్మం-దేవరపల్లి గ్రీన్ ఫీల్డ్ హైవే పనుల నిమిత్తం మండలంలోని ఎపిగింట వచ్చారు. అక్కడ క్యాంపులో ఉంటూ రోడ్డు పనులు చేస్తున్నారు. ఈ క్రమంలో ఈ నెల 20వ తేదిన మండలంలోని వెంకటాపురం సమీపంలో ట్రాక్టర్‌పై సిమెంట్ రాళ్ల లోడు వేసుకుని తోటి కూలీలతో వెళ్తుండగా ట్రాక్టర్ డ్రైవర్ అతివేగంగా నడపడంతో అదుపుతప్పి సరేన్ మంజి కిందపడగా అతనిపై సిమెంట్ రాళ్లు పడడంతో తీవ్రంగా గాయాలపాలయ్యాడు. అతడిని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం చింతలపూడి ప్రభుత్వ ఆసుపత్రికి అంబులెన్స్‌లో తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. మృతుని బంధువు మెంగల్ మంజి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

దాడి ఘటనలో కేసు నమోదు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

ఇద్దరు వ్యక్తుల మధ్య చిన్నపాటి గొడవ కాస్త పెద్దదై కొట్లాటకు దారి తీయడంతో ఒక వ్యక్తి చేతి ఎముక విరిగింది. దీంతో శుక్రవారం పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. హెడ్ కానిస్టేబుల్ నాగేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని తాటియాకులగూడెం గ్రామానికి చెందిన కె.రాధాకృష్ణ, అదే గ్రామానికి చెందిన జె.రాంబాబుల మధ్య కొన్ని రోజులుగా మాటల యుద్ధం జరుగుతుంది. అది కాస్త ముదిరి కొట్లాటకు దారి తీసింది. ఈ ఘటనలో రాధాకృష్ణ చేతి ఎముక విరిగింది. వెంటనే అతడిని చికిత్స నిమిత్తం జీలుగుమిల్లి పిహెచ్‌సికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు రాంబాబుపై కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ కె.నాగేశ్వరరావు తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణమైన విద్య


విద్యార్థులకు కిట్ల పంపిణీ కార్యక్రమాల్లో వక్తలు

ప్రజాశక్తి - మండవల్లి

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని సర్పంచి మెండ ఝాన్సీ అన్నారు. స్థానిక ప్రధాన సెంటర్‌లోని ప్రాథమిక పాఠశాల-1లో పలువురితో కలిసి ఆమె శుక్రవారం పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు, బెల్ట్‌తో కూడిన కిట్లను విద్యార్థులకు అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రయివేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధన జరుగుతుందన్నారు. అంతేకాకుండా విద్యార్థుల విద్యాభివృద్ధి కోసం ప్రభుత్వ పాఠశాలల్లో పూర్తిస్థాయిలో మౌలిక వసతులను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఆర్థిక స్థితిగతులు విద్యార్థి విద్యకు ఆటంకం కలగకూడదనే ఉద్దేశంతో పాఠ్య, నోటు పుస్తకాలు, ఏకరూప దుస్తులు అందించడంతో పాటు మధ్యాహ్న భోజన పథకాన్ని రుచికరంగా వండి అందిస్తున్నారన్నారు. కేవలం ప్రభుత్వ పాఠశాలల్లోనే క్రమశిక్షణతో కూడిన విద్య అందుతుందన్నారు. సౌకర్యాలను అందిపుచ్చుకుని తమ చిన్నారులను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి వారి భవిష్యత్తుకు చక్కని బాటలు వేసుకోవాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో గుడివాడ చిట్టిబాబు పాఠశాల ప్రధానోపాధ్యాయులు పిట్ట ప్రతాప్‌కుమార్, చాబత్తిన విజయ్, ముళ్లపూడి సత్తిబాబు, బోయిన రాజేష్, కొనపరెడ్డి కోటేశ్వరరావు, గుడివాడ గణేష్, శ్యాము, మురళి, ఉపాధ్యాయులు, అంగన్వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.



మండవల్లిలో...



కామవరపుకోటలో...

చింతలపూడి : చంద్రబాబు విద్యార్థుల పక్షపాతి అని, ఇంటర్ విద్యార్థులకు కూడా పాఠ్య పుస్తకాలు, సైకిళ్లు పంపిణీ చేయాలని విద్యాశాఖ మంత్రి లోకేష్ ఆదేశాలు ఇవ్వడం శుభ పరిణామమని టిడిపి చింతలపూడి టౌన్ అధ్యక్షులు వెంకటేశ్వరరావు, టౌన్ ప్రధాన కార్యదర్శి బోడ నాగభూషణం అన్నారు. చింతలపూడిలోని బాలికల హైస్కూల్‌లో ప్రధానోపాధ్యాయులు చక్రధరరావు ఆధ్వర్యంలో ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ ఆదేశాల మేరకు విద్యార్థులకు కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జనసేన చింతలపూడి మండలాధ్యక్షులు చీదరాల మధు, ఐటిడిపి నియోజకవర్గ అధ్యక్షులు బోడ అనీష్‌కుమార్ మాట్లాడుతూ నారా లోకేష్ విద్యాశాఖ మంత్రిగా విద్యారంగంలో ఎన్నో నూతన సంస్కరణలు తీసుకొస్తున్నారన్నారు. మోటివేషన్, ఆన్‌లైన్ క్లాసులు చెప్పించడానికి ఎంఎల్ఎ రోషన్‌కుమార్ సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఏలూరు జిల్లా రైతు కార్యదర్శి కొత్తపూడి శేషగిరిరావు, మన్యం సత్తిబాబు, తాటి అప్పారావు, తిరుమిల్లి రామారావు, బిజెపి జిల్లా నాయకులు విజయ, తోట నారాయణరావు, టిడిపి నాయకులు చిట్లూరి ధర్మరాజు, సొంగా ఏసుపాదం, కంభం రమేష్, జనసేన నాయకులు అర్నేపల్లి అప్పారావు, ఎజిఎస్.కుమార్, ఉపాధ్యాయులు చార్లెస్, విజయనంద్, పూరేటి శ్రీను పాల్గొన్నారు.

కామవరపుకోట : ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ఉచితంగా ప్రభుత్వం కల్పిస్తున్న వసతులను వినియోగించుకుని మంచిగా చదువుకుని జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని టిడిపి వీరిశెట్టిగూడెం గ్రామ కమిటీ అధ్యక్షుడు నెక్కలపూడి మల్లికార్జునరావు అన్నారు. వీరిశెట్టిగూడెం ప్రీ హైస్కూల్‌లో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్న పలువురు మంచి ఉద్యోగాలు, వ్యాపారాలు చేయడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థులు స్కూల్ దశ నుంచి మంచి క్రమశిక్షణతో మెలగాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు గోపాలకృష్ణ, సర్పంచి రామ్మోహన్‌రావు, బొంతు రాజు, కోడె రమేష్, కొప్పిశెట్టి చిన్న, దాసి పండు పాల్గొన్నారు.

కలిదిండి : పేట కలిదిండి ఎంపిపి పాఠశాలలో విద్యార్థులకు టిడిపి మండలాధ్యక్షులు పోకల జోగిరాజు ఆధ్వర్యంలో కిట్లు పంపిణీ చేశారు. ఎంపిటిసి సభ్యులు నీలి సుమన్, జెడ్‌పిటిసి మాజీ సభ్యులు నున్న రమాదేవి, ఎంపిటిసి మాజీ సభ్యులు లంకా రత్నారావు, నాయకులు టి.నాంచారయ్య, పేటేటి వెంకటసత్యనారాయణ, యలవర్తి వెంకటేశ్వరరావు, పాఠశాల సిబ్బంది, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. మండలంలోని అమరావతి మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. సర్పంచి పి.భోగేశ్వరరావు, పిఎంసి చైర్ పర్సన్ వై.ఈశ్వరి చేతుల మీదుగా కిట్లు పంపిణీ చేశారు. ప్రధానోపాధ్యాయులు ఎఎస్ఎన్.బెనర్జీ, పాఠశాల సిబ్బంది ఎస్.ఝాన్సీ, టి.పాపాయమ్మ, పిఎంసి సభ్యులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పలుచోట్ల ఘనంగా ఏరువాక పూర్ణిమ

ప్రజాశక్తి - ముసునూరు

గత 40 ఏళ్లుగా గుడిపాడు, గుళ్లపూడి గ్రామాల్లో పోడు భూములు సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న బడుగు బలహీన రైతుల భూములకు హక్కు పట్టాలు కల్పించి, తద్వారా పంట రుణాలు ఇప్పించాలని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాయంకుల లక్ష్మణరావు, బత్తుల వెంకటేశ్వరరావు కోరారు. మండలంలోని గుడిపాడు గ్రామంలో వారి ఆధ్వర్యంలో రైతులు తమ కుటుంబ సభ్యులతో పాల్గొని ఏరువాక పండుగ శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు, వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రైతులకు ప్రభుత్వాలు అండగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో కొల్లి నాగేశ్వరరావు, కొమ్మన నాగేశ్వరరావు, చలసాని రామారావు, కూచిపూడి నాగేశ్వరరావు, చెంగల వెంకటేశ్వరరావు, కర్రా రామకృష్ణ, కొయ్యూరు ఏడుకొండలు, మోటకట్ల అశోక్ కుమార్, చెంచెన నాగార్జున, మోతగాని తిరుపతిరావు, ముళ్లపూడి రమేష్, జానేస్, పొన్ను పూరిరాజు, తుమ్మలపల్లి నాగేశ్వరరావు, పంతగాని తిరుపతిరావు పాల్గొన్నారు.

చింతలపూడి : అందరికీ అన్నం పెట్టే రైతన్న పరిస్థితి నేడు దయనీయంగా మారిందని రైతు సంఘం ఏలూరు జిల్లా అధ్యక్షులు పుల్లూరి సోమశేఖరాచార్యులు, కౌలు రైతుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దొంతా కృష్ణ అన్నారు. మండలంలోని ఎర్రగుంటపల్లి గ్రామంలో రైతు సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఏరువాక పూర్ణిమ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు రోజుకు 40 మంది ఆత్మహత్య చేసుకోవడం చాలా బాధాకరమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతాంగ సమస్యలపై దృష్టి పెట్టి అన్ని పంటలకు కనీస మద్దతు ధర స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల మేరకు కల్పించాలని కోరారు. మోటార్లకు మీటర్లు రద్దు చేయాలని, రైతులకు వ్యవసాయ యంత్రాలు, పనిముట్లు 50 శాతం రాయితీపై అందించాలని కోరారు. సిపిఐ మండల కార్యదర్శి కంచర్ల గురవయ్య ఏరువాక పూర్ణిమ విశిష్టత గురించి వివరించారు. రైతుకు అన్ని పనిముట్లను చేసి రైతుకు వెన్నెముకగా ఉన్న కార్పెంటర్స్‌ను సత్కరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ సీనియర్ నాయకులు జంగా రామచంద్రారెడ్డి, ఆరేపల్లి వెంకట సుబ్బారావు, మొగిలిచర్ల జనార్ధనాచారి, రైతు సోదరులు పాల్గొన్నారు.



ముసునూరు మండలం గుడిపాడులో...

అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్ సి.పురుషోత్తంకుమార్ ఆధ్వర్యంలో ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ భవనంలో శుక్రవారం న్యాయమూర్తులకు, న్యాయవాదులకు, కోర్టు సిబ్బందికు యోగా శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయమూర్తి పురుషోత్తంకుమార్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఐదో అదనపు జిల్లా జడ్జి జి.రాజేశ్వరి, పోక్సో జడ్జి ఎస్.ఉమాసునంద, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి ఐ.శ్రీనివాసమూర్తి, అదనపు సీనియర్ సివిల్ జడ్జి కెకెవి.బుల్లికృష్ణ, ఇతర న్యాయమూర్తులు, న్యాయవాదులు పాల్గొన్నారు. మాస్టర్స్ శివ చలమల యోగా శిక్షణ తరగతులు నిర్వహించారు.

స్థానిక సర్ సిఆర్ రెడ్డి కళాశాల వ్యాయామ శాలలో శుక్రవారం కళాశాల వ్యాయాయ విభాగం, ఐక్యూఎసి, ఎన్ఎస్ఎస్-1, 2 విభాగాల ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రధానాచార్యులు డాక్టర్ కెఎ.రామరాజు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ కెఎస్.విష్ణుమోహన్ హాజరయ్యారు. ముఖ్య వక్తగా కళాశాల సంస్కృత శాఖాధ్యక్షులు డాక్టర్ కెవిఎస్పిబి.ఆచార్యులు హాజరయ్యారు. అనంతరం కళాశాల వ్యాయామ అధ్యాపకులు ఎ. ధర్మేంద్ర, ఎం.సాయికిషోర్ ఆధ్వర్యంలో అధ్యాపకులు, విద్యార్థులు యోగాసనాలు సాధన చేశారు.

ఏలూరు సిటీ : స్థానిక శాంతినగర్ శ్రీ చైతన్య పాఠశాలలో యోగా డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ప్రిన్సిపల్ శివకుమారి హాజరై మాట్లాడారు. విద్యార్థులు యోగాసనాలు వేశారు. శ్రీ చైతన్య వెస్ట్ జోన్ ఎజిఎం శ్రీ శంకర పార్థసారధి, ఆర్ఐ సిహెచ్.ఉదయభాస్కర్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అకాడమిక్ డీన్ సంజీవ్ కుమార్, ప్రైమరీ ఇన్‌ఛార్జి నరీనా, ప్రీ ప్రైమరీ ఇన్‌ఛార్జి షబానా, ఎఒ ప్రవీణ్, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్స్ దివ్య, విజయ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొయ్యలగూడెం : జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల పరింపూడిలో అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా విద్యార్థులతో వ్యాయామ ఉపాధ్యాయురాలు బి.దుర్గారాణి సూర్య నమస్కారాలు, ప్రాణాయామం, ధ్యానం, ఆసనాలు చేయించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం నిమ్మలూరి ఉమాదేవి, ఉపాధ్యాయులందరూ పాల్గొని విద్యార్థులను అభినందించారు.

నూజివీడు : అన్నే రామకృష్ణయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గొల్లపల్లిలో అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు విజయవంతంగా నిర్వహించినట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాధికా రాణి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పి.రవీంద్ర, పుల్లారావు, లక్ష్మి, మల్లేశ్వరి, విఠల్ బాబు, మోహన్‌రావు, కృష్ణవేణి, కోటేశ్వరమ్మ, సౌజన్య, మనోహరం, రంగారావు, సాకారవి, బాలు, నాన్ టీచింగ్ సిబ్బంది రవి, నారాయణ, మరియమ్మ పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం: మండలం లోని దేవులపల్లి గ్రామంలో శుక్రవారం యోగా డే నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వేమూరి శ్రీనివాస్ మాట్లాడారు. అనంతరం అనేక ఏళ్లుగా ఉచితంగా యోగా నేర్పుతున్న యోగా గురువులు దుర్గాప్రసాద్‌ను సన్మానించారు. కార్యక్రమానికి మండలాధ్యక్షులు పారేపల్లి సత్యనారాయణ అధ్యక్షత వహించారు. జిల్లా ఉపాధ్యక్షుడు, రూరల్ మండల ఇన్‌ఛార్జి వేమూరి శ్రీనివాస్, డి.నారాయణమూర్తి, కృష్ణ, కార్యకర్తలు, పిల్లలు, అభిమానులు పాల్గొన్నారు.

బుట్టాయగూడెం : స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్ ప్లస్‌లో ప్రపంచ యోగా డే కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ముందుగా విద్యార్థులతో వివిధ ఆసనాలను వేయించారు. స్థానిక ఆయుష్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ప్రియదర్శిని యోగా ఆవశ్యకతను వివరించారు. ముఖ్య అతిథులుగా ఎంఇఒలు తెల్లం బాబూరావు, నరేంద్రరాయ్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు గంగాదేవి, ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, రాజుదొర, రామచంద్రం పాల్గొన్నారు.

చాట్రాయి : చిన్నంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో చాట్రాయి మండల విద్యాశాఖాధికారి విఎస్‌వి.బ్రహ్మాచారి పాల్గొని యోగా దినోత్సవ ప్రాముఖ్యతను వివరించారు. తుమ్మగూడెం ఎంపిపిఎస్ ఉర్దూ పాఠశాలలో విద్యార్థులతో పాఠశాల ప్రధానోపాధ్యాయులు గంపా వెంకట్రావు యోగా చేయించారు. ఎంఇఒ-1 కలపాల సర్వేశ్వరరావు, ఎఎన్‌ఎం, ఆశా కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు. చిన్నంపేటలో ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు హెచ్.రవి, పాఠశాల ఉపాధ్యాయ బృందం పాల్గొనగా చిత్తపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు ప్రభాకర్ యోగాసనాలు నిర్వహించారు.

ఉంగుటూరు : కైకరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థులు, ఉపాధ్యాయులు యోగాసనాలు వేశారు. యోగాతో కలిగే ఆరోగ్య వివరాలను ఎంఇఒ కె.శ్రీనివాసరావు వివరించారు. ప్రధానోపాధ్యాయుడు గుళ్ల ప్రసాదరావు, జి.గవరయ్య, ఉపాధ్యాయులు విద్యార్థులతో పాటు యోగా చేశారు. నారాయణపురం ఉషోదయ హైస్కూల్‌లో మానవత సంస్థ, లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. స్కూల్ ప్రిన్సిపల్ గుణ్ణం బుల్లెబ్బాయి, మానవత నాయకులు పుప్పాల గోపీ, జి.రవి, ప్రతాప్ పాల్గొన్నారు.

టి.నరసాపురం : యోగా మానసిక వికాసానికి దోహదపడుతుందని మండల విద్యాశాఖాధికారి టి.రామ్మూర్తి, ఎస్.కళ్యాణి తెలిపారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని మక్కినవారిగూడెం, టి.నరసాపురం, బొర్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులు యోగాసనాలు వేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎల్.వెంకటేశ్వరరావు, బిఎల్.స్వామి పాల్గొన్నారు.

ముసునూరు : మండలంలో అన్ని గ్రామపంచాయతీల్లో ఉపాధి హామీ పని ప్రదేశాల్లో యోగా డే కార్యక్రమం నిర్వహించారు వేల్పుచర్ల గ్రామంలో అమృత సరోవర్ చెరువులో ఎపిఒ టి.రోజ్‌లీలా కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక హైస్కూల్ హెచ్‌ఎం, వ్యాయామ ఉపాధ్యాయులు సుకుమార్ యోగా గురించి అవగాహన కల్పించారు.

జీలుగుమిల్లి : ప్రతి రోజు యోగా చేయడం వల్ల శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యాన్ని పొందవచ్చని ఎంపిడిఒ కెఎం.మంగతాయారు అన్నారు. మండలంలోని పలు సచివాలయల్లో యోగా దినోత్సవ వేడుకలను నిర్వహించారు. మండలంలోని పలు పాఠశాలల్లో ఎంఇఒ కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులచే యోగాసనలు చేశారు. దర్భగూడెం పంచాయతీలో ఉపాధి హామీ పని ప్రదేశం వద్ద సర్పంచి సున్నం ఉషారాణి ఆధ్వర్యంలో ఉపాధి కూలీలతో యోగా చేయించారు.

పోలవరం : మండలంలోని అన్ని గ్రామాల్లో అమృత్ సరోవర్ ట్యాంకుల వద్ద, ఉపాధి హామీ పథకం పని ప్రదేశంలో, ప్రగడపల్లిలో సర్పంచి కలుం బాపిరాజు ఆధ్వర్యంలో యోగా డే కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎపిఒ జి.వెంకటేశ్వరరావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ జి.శ్రీను, సర్పంచి కలుం బాపిరాజు, ఎపిఒ జి.వెంకటేశ్వరావు, ఫీల్డ్ అసిస్టెంట్ ఎం.ఇందిర, బిఎఫ్‌టిఎస్‌కె.పవన్‌కుమార్, జె.హరీష్‌కుమార్ పాల్గొన్నారు.

ఆగిరిపల్లి : యోగాతో ఏకాగ్రత, జ్ఞాపకశక్తిని పెంపొందించుకోవడంతో పాటు మానసిక, శారీరక ధృఢత్వం కలిగి ఉండవచ్చని ఆగిరిపల్లి గ్రామ సర్పంచి చవటపల్లి లక్ష్మీ విక్టర్‌బాబు అన్నారు. ఆగిరిపల్లి హోమియో వైద్యశాల, జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల, పోతవరప్పాడులోని ఎలిజబెత్ చిల్డ్రన్ హోం, ఎన్ఆర్ఐ కళాశాలలో యోగా దినోత్సవం వేడుకలు వివరించారు. ఈ కార్యక్రమంలో యోగా గురువు టివి.కుమార వెంక అప్పారావు, కె.పాల్‌రమేష్, పి.పుష్పలత, డి.రజిత, ఎ.ఝాన్సీలక్ష్మి, ఆర్.వెంకట్రావు పాల్గొన్నారు.

కామవరపుకోట : యోగా చేయడం ద్వారా శారీరిక, మానసిక ఆరోగ్యం పెంపొందించుకోవచ్చని ఎంఇఒ-1 డి.సుబ్బారావు అన్నారు. తడికలపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు అంగులూరి సర్వేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలకు ఆయన హాజరయ్యారు. పాఠశాలలో యోగా తరగతులకు వసతులు కల్పించడం కోసం తడికలపూడి హోమియో హాస్పిటల్ ఫార్మసిస్ట్ వి.శ్రీనివాసరావు రూ.ఐదు వేల చెక్కును అందించారు. అనంతరం యోగా మాస్టర్ ఆకుల సుధీర్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ-2 ప్రశాంత్‌కుమార్, హోమియో మెడికల్ ఆఫీసర్ రఫియా పర్వీన్, సిఆర్‌పి కమలాకర్, పాఠశాల బోధన, బోధనేతర సిబ్బంది, పంచాయతీ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

మండవల్లి : మానసిక ఒత్తిడి నుంచి ఉపశమనం పొందేందుకు యోగా ఎంతగానో దోదపడుతుందని ఎంపిడిఒ బేబీ శ్రీలక్ష్మి అన్నారు. కానుకొల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అనంతరం యోగా గురువు పిడి.సత్యనారాయణను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి నాగరాజ్ థామస్, పంచాయతీ కార్యదర్శి ఎస్‌వి.రాధిక, ప్రధానోపాధ్యాయులు మాధవ కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కలిదిండి : ఎంఇఒ పిడుగు ప్రభాకర బాబు విద్యార్థులతో యోగాసనాలు వేయించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ముదినేపల్లి : మండలంలోని పలు పాఠశాలల్లో యోగా దినోత్సవం నిర్వహించారు. ముదినేపల్లి, అల్లూరు, చిగురుకోట జెడ్‌పి హైస్కూళ్లలో ప్రత్యేక యోగా ప్రదర్శనను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఇఒ కె.నరేష్‌కుమార్ మాట్లాడారు.

అయ్యవారిరుద్రవరంలో 'నేను బడికి పోతా'

ప్రజాశక్తి - మండవల్లి

బడి ఈడు పిల్లలంతా బడిలోనే ఉండి విద్యను అభ్యసించేలా ప్రతిఒక్కరూ చూడాలని ఎంఇఒ-2 ఎస్.రత్నసునాదం తెలిపారు. అయ్యవారి రుద్రవరంలో శుక్రవారం నిర్వహించిన నేను బడికి పోతా ర్యాలీలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. బడి ఈడు పిల్లలు ఎక్కడైనా కనిపిస్తే అధికారుల దృష్టికి తీసుకొచ్చి వారిని బడిలో చేర్పించే విధంగా ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు చిరిగిరి పిచ్చోడు, సిఆర్‌పి స్మారకకుమారి, ఎంఎల్‌హెచ్‌పి, ఎఎన్‌ఎం, ఆశావర్కర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

టిడిపి, జనసేన నేతల సంబరాలు

ప్రజాశక్తి - కామవరపుకోట

చింతలపూడి ఎంఎల్ఎగా సొంగా రోషన్ కుమార్ అసెంబ్లీ లో ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా మండలంలోని కామవరపుకోట గ్రామ పంచాయతీ శివారు కొమ్ముగూడెంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో చింతపల్లి ప్రసాద్, జోడాల యెషయా, టిడిపి శ్రేణులు పాల్గొన్నారు.

పోలవరం : పోలవరం ఎంఎల్ఎగా చిర్రి బాలరాజు అసెంబ్లీలో ప్రమాణస్వీకారం చేసిన సందర్భంగా మండలంలోని జనసేన పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ మండలాధ్యక్షుడు వీర వెంకట సత్యనారాయణ (చిన్ని) ఆధ్వర్యంలో కేక్ కటింగ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు తెలగంశెట్టి ప్రసాద్ (రాము), ఉపాధ్యక్షుడు కురసం రమేష్, మండల ప్రధాన కార్యదర్శి చీకట్ల సాయికృష్ణమూర్తి, మండల ప్రధాన కార్యదర్శి మామిడిపల్లి వరప్రసాద్, ఒనిమిరెడ్డి సీతయ్య, నాగిరెడ్డి నాగు, మామిడిపల్లి స్వాతి, పట్టణ అధ్యక్షుడు అనిశెట్టి రాదయ్య, కిషోర్, ఉడతా గణేష్, సిద్ధ రామకృష్ణ పాల్గొన్నారు.